సాక్షి
నిజామాబాద్
బుధవారం : 19 : జూన్ : 2024



నివేదిక సిద్ధం

జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌ల నివేదికను జిల్లా వైద్యశాఖ అధికారులు సిద్ధం చేశారు.

- 8లో ▸



మూగవేదన..

పశువైద్యశాలలో జీవాలు, పాడి పశువులకు సరైన వైద్య సేవలు అందడం లేదు. వైద్యులు లేక పశువైద్యశాలలను మూసివేస్తున్నారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.3 /26.6

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

20 నుంచి పాలీసెట్ కౌన్సెలింగ్

నిజామాబాద్‌అర్బన్ : పాలీసెట్ మొదటి విడత కౌన్సెలింగ్‌ను ఈనెల 20 నుంచి నిర్వహించనున్నట్లు సమన్వయకర్త శ్రీరాంకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు స్లాట్‌బుక్ చేసుకోవాలని సూచించారు. స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. అనంతరం ఈ నెల 27 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. ఈ నెల 30వ తేదీలోగా సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. కౌన్సెలింగ్‌కు వచ్చే విద్యార్థులు తప్పనిసరిగా పాలీసెట్ హాల్ టికెట్, పాలీసెట్ ర్యాంక్ కార్డ్, పదో తరగతి మెమో, నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యూఎస్ ధ్రువపత్రం, ఒరిజినల్, జిరాక్స్ తీసుకొని రావాలన్నారు.

20న ఉద్యోగ మేళా

నిజామాబాద్‌నాగారం : జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 20న ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సిరిమల్ల శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మేళాలో ముత్తూట్ ఫైనాన్స్ నియామకాలు చేపడుతుందన్నారు. ఇందులో బ్రాంచ్ మేనేజర్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, జూనియర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, జూనియర్ రిలేషన్ షిప్ ఎగ్జిక్యూటివ్, ఇంటర్న్ గ్రాడ్యుయేట్ ట్రైయినీ పోస్టులు ఉన్నాయని తెలిపారు. ఇంటర్, ఏదైనా డిగ్రీ, బీబీఏ, ఎంబీఏ పూర్తిచేసి వయోపరిమితి 18 నుంచి 30 ఏళ్లలోపు ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు నగరంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 95817 68413, 99487 48428, 63057 43423, 99594 56793 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సివిల్స్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

నిజామాబాద్‌అర్బన్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో యూపీఎస్సీ సివిల్స్‌కు ఉచితంగా లాంగ్ టర్మ్ కోచింగ్ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకన్న ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కోచింగ్ తరగతులు జులై 18 నుంచి ఏప్రిల్ 2025 వరకు బీసీ స్టడీ సర్కిల్ హైదరాబాద్‌లో కొనసాగుతాయన్నారు. 100 మంది అభ్యర్థులకు కోచింగ్ ఇవ్వనుండగా ఇందులో స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ప్రతిభవంతులను ఎంపిక చేస్తామన్నారు. ఈనెల 19 నుంచి వచ్చే నెల మూడో తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 08462-241055 నంబరును సంప్రదించాలన్నారు.

జూలై 7వ తేదీలోపు వార్షిక ఫీజు చెల్లించండి

నిజామాబాద్‌అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో పీజీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వార్షిక ఫీజును జూలై 7వ తేదీలోపు చెల్లించాలని కో–ఆర్డినేటర్ రంజిత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ. 500 అపరాధ రుసుముతో జూలై 14వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు జూలై 31 నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు జరుగనున్నాయని పేర్కొన్నారు. పీజీ ఫస్టియర్ పరీక్షలు ఆగస్టు 9 నుంచి ఆగస్టు 13వ తేదీ వరకు జరుగుతాయన్నారు. పరీక్ష ఫీజు ఒక్కో పేపర్‌కి రూ. 200 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 73829 29612 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేడు జిల్లాకు రాష్ట్ర లెప్రసీ అడిషనల్ డైరెక్టర్

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర లెప్రసీ అడిషనల్ డైరెక్టర్ జాన్‌బాబు బుధవారం జిల్లాకు రానున్నారు. జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులపై తరచుగా వస్తున్న ఆరోపణలపై ప్రత్యేక టీంతో కలిసి తనిఖీలు చేయనున్నారు. ఈ సందర్భంగా పలు ఆస్పత్రులను పరిశీలించనున్నారు. జాన్‌బాబు రానుండడంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో వణుకు మొదలైంది.

ఎన్నికల విధుల్లో మృతి చెందిన సిబ్బందికి ఎక్స్‌గ్రేషియా

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల విధుల్లో మృతిచెందిన ఇద్దరు అధికారులకు భారత ఎన్నికల సంఘం మంగళవారం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ధర్పల్లి మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్, ధర్పల్లి మండలం హొన్నాజీపేటకు చెందిన వీఆర్వో షేక్‌సాజిక్‌లకు అనారోగ్యకారణాల రీత్యా మృతి చెందిన విషయం తెలిసిందే. వీరి కుటుంబాలకు రూ. 15 లక్షల చొప్పున భారత ఎన్నికల సంఘం ప్రకటించింది.

టమాట సెంచరీ!

కూరగాయల ధరలు చూసి సామాన్యుడు హడలి పోతున్నాడు. వంటల్లో అతిగా వినియోగించే టమాట, పచ్చి మిర్చి, కొత్తిమీర రేట్లు కిలో వంద రూపాయల పైగానే పలుకుతున్నాయి. గత పదిరోజుల వ్యవధిలోనే కూరగాయల ధరలు రెట్టింపయ్యాయి. స్థానికంగా కూరగాయలు సాగు చేయకపోవడంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా డిమాండ్‌కు తగ్గట్లు కూరగాయలు రావడంలేదు. ధరలు పెరగడానికి ఇది ప్రధాన కారణంగా చెబుతున్నారు.

రూ. 120కి చేరిన మిర్చి..

- కూరగాయల ధరలకు రెక్కలు
- రేట్లు చూసి బెంబేలెత్తిపోతున్న జనం
- ఆగస్టు మొదటి వారం వరకూ ఇదే పరిస్థితి..

మార్కెట్‌లో కూరగాయల ధరలు (రూపాయల్లో..)

కూరగాయలు	హోల్‌సేల్ (కిలో)	రిటైల్ (కిలో)	కాకరకాయ	50	60	క్యారెట్	40	60
			వంకాయ	35	60	పాలకూర	30	40
టమాట	70	100	పచ్చిమిర్చి	100	120	మెంతికూర	70	80
గోరు చిక్కుడు	35	60	క్యాప్సికం	50	80	దొండకాయ	30	50
బెండకాయ	40	60	కొత్తిమీర	100	120	గోబిగడ్డ	25	50
జీరకాయ	60	80	పుదీన	60	80	ఉల్లిగడ్డ	35	50

సుభాష్‌నగర్ : కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. టమాట, కొత్తిమీర ధరలు సెంచరీ కొట్టగా.. పచ్చిమిర్చి అంతకుమించి కిలో రూ. 120కిపైనే పలుకుతోంది. ఇతర కూరగాయల ధరలు కూడా రూ. 50కి తగ్గకుండా పలుకుతున్నాయి. జిల్లాలో రైతులు కూరగాయల సాగు చేయకపోవడంతో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. అయా రాష్ట్రాల నుంచి కూడా డిమాండ్‌కు తగ్గట్లు కూరగాయలు రావడంలేదు. ధరలు పెరగడానికి ఇదొక కారణంగా అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం స్థానిక రైతులు కూరగాయల పంటలు తొలగించి, సీజన్‌లో వరి, ఇతర పంటలు సాగు చేస్తుంటారు. గత వారం రోజులుగా కూరగాయల ధరలు క్రమంగా పెరుగుతుండడంతో సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది.

ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులు

జిల్లా కేంద్రంలోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌కు ప్రస్తుతం మహారాష్ట్రలోని మంచార్, బుల్డాన్, కన్నడ్, ఔరంగాబాద్, మధ్యప్రదేశ్‌లోని చిన్వడ్, కర్నాటకలోని బెల్గాం, ఆంధ్రప్రదేశ్‌లోని బాగేపల్లి, మదనపల్లి నుంచి టమాట, మిర్చి పంటలు దిగుమతి అవుతున్నాయి. ఉల్లిగడ్డ సోలాపూర్ నుంచి వస్తోంది. అలాగే బోయిన్‌పల్లి, ఒంటిమామిడి, గుడిమల్కాపూర్, సిద్దిపేట్‌తో పాటు జిల్లాలోని ఆర్మూర్, అంకాపూర్, కృష్ణనగర్, బాడ్సి, పెద్ద బోర్గాం, మెంట్రాజ్‌పల్లి, గొల్లపల్లి తదితర ప్రాంతాల నుంచి ఇతర కూరగాయలు తీసుకొస్తున్నారు. నిత్యం మార్కెట్‌కు సగటున 450 క్వింటాళ్ల వరకు మాత్రమే వివిధ రకాల కూరగాయలు వస్తున్నాయి. ఇక్కడి నుంచి జిల్లాలోని బోధన్, బాన్సువాడ, భీమ్‌గల్, ఆర్మూర్‌తో పాటు పక్కనున్న జిల్లాలు, మండలాలు, గ్రామాలకు రిటైల్ వ్యాపారులు తీసుకెళ్లి ప్రజలకు విక్రయిస్తుంటారు.



జూన్, జూలైలలో..

కూరగాయల ధరలు ప్రతి ఏడాది జూన్, జూలై నెలల్లో క్రమంగా పెరుగుతూనే ఉంటాయి. ఆగస్టు మొదటివారం నుంచి తగ్గుముఖం పడతాయి. ప్రస్తుతం రిటైల్ మార్కెట్‌లో మిర్చి రూ. 120 నుంచి రూ. 140 వరకు పలుకుతోంది. టమాట ధర రూ. 100కు చేరింది. కొత్తిమీర కూడా రూ. 100కుపైనే పలుకుతుండడం గమనార్హం. ముఖ్యంగా మార్కెట్‌లో టమాట, మిర్చి మాత్రమే అత్యధిక వినియోగం ఉంటుంది. పది రోజుల వ్యవధిలోనే ధరలు రెట్టింపయ్యాయి. మహారాష్ట్రలోని నాందేడ్, లాతూర్, ఉమ్రి నుంచి కూరగాయలు దిగుమతి అయ్యే వరకూ (ఆగస్టు మొదటి వారం) ధరలు ఇలాగే కొనసాగే అవకాశముందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

కొనలేకపోతున్నాం



మార్కెట్‌కు వెళ్లి కూరగాయల ధరలు వింటే కొనలేకపోతున్నాం. పచ్చిమిర్చి, టమాట ధరలు ఆకాశాన్నంటాయి. మిగతా వాటి ధరలు కూడా రూ. 50కి తక్కువగా లేవు. తప్పనిసరి పరిస్థితుల్లో తక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తున్నాం. కూరగాయలు కొనే బదులు పప్పులు వండుకోవడం నయమనే పరిస్థితి వచ్చింది.

– గంగామణి, చిన్నాపూర్

ధరలు అమాంతం పెరిగాయి



మార్కెట్‌లో కూరగాయల ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. నాలుగు రోజులకే రెట్టింపయ్యాయి. ఏం కొనాలన్నా జేబులకు చిల్లు పడుతోంది. వారానికి సరిపడా కూరగాయలు తీసుకెళ్లాలంటే కనీసం రూ.300లకుపైనే అవుతున్నాయి. పేద, మధ్యతరగతి ప్రజలకు ఈ ధరలు అధిక భారమయ్యాయి.

– సత్యం, గాయత్రినగర్

ఆ మూడు దోపిడీలు ఒకే మాదిరి!



బాల్కొండలో చోరీ జరిగిన ఏటీఎం వద్ద డాగ్ స్క్వాడ్‌తో పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

బ్యాంకులు, ఏటీఎంలే టార్గెట్

- పోలీసులకు సవాల్ విసురుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాలు
- బాల్కొండ, మెండోరా మండలాల్లో వరుసగా ఏటీఎంలు, బ్యాంకుల్లో నగదు, బంగారం చోరీలు
- సినీఫక్కీలో రెక్కీ.. సీసీ కెమెరాలపై స్ప్రే, గ్యాస్ కట్టర్లతో కన్నాలు
- అంతర్రాష్ట్ర ముఠాలు కావడంతో రికవరీ కోసం పోలీసుల పాట్లు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : అంతర్రాష్ట్ర దొంగల ముఠాలు జిల్లా పోలీసులకు సవాల్ విసురుతున్నాయి. నిజామాబాద్ జిల్లాకు ఉత్తర కొనలో నిర్మల్ జిల్లాకు సరిహద్దులో, 44వ నంబర్ జాతీయ రహదారికి ఆనుకుని.. అదే హైవే నుంచి మహారాష్ట్ర సరిహద్దుకు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న బాల్కొండ, మెండోరా మండలాల్లో ప్రొఫెషనల్ దొంగల ముఠాలు రెక్కీలు నిర్వహించి మరీ బ్యాంకుల ఏటీఎంలను, బ్యాంకునే లక్ష్యంగా చేసుకుని దోపిడీలు చేశారు. నగదు, బ్యాంకులో బంగారాన్ని దోచుకెళ్లారు. 2022, 2023, 2024లో వరుసగా ఇదే ప్రాంతంలో చోరీలు జరిగాయి. పైగా ఈ మూడు చోరీలూ ఒకే మాదిరిగా ఉండటం గమనార్హం. అంతర్రాష్ట్ర దొంగల ముఠాలు ఇదే ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని మరీ వరుసగా పకడ్బందీగా చోరీలకు పాల్పడుతుండడం విశేషం. అంతర్రాష్ట్ర ముఠాలు పాల్పడిన ఈ చోరీల కేసులను ఛేదించే విషయంలో పోలీసులకు పాట్లు తప్పడం లేదు.

■ బాల్కొండ మండలం వన్నెల్(బి) గ్రామ చౌరస్తా వద్ద ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంను ఈ నెల 4న గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసి రూ.25 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. రెక్కీ నిర్వహించిన ముఠా కియా వాహనంలో వచ్చింది. దుండగులు కేవలం 9 నిమిషాల వ్యవధిలోనే రూ.25 లక్షల నగదును దోచుకున్నారు. గతంలో పోచంపాడ్‌లో ఏటీఎంలో చోరీకి పాల్పడిన విధంగానే దుండగులు ముందుగా వచ్చీరావడంతోనే అక్కడి సీసీ కెమెరాలపై నల్లటి రంగును స్ప్రే చేశారు. అనంతరం ఏటీఎంలను గ్యాస్ కట్టర్లతో ధ్వంసం చేసి నగదును ఎత్తుకెళ్లారు. విచారణలో పురోగతి లేదు.

■ మెండోరా మండలం పోచంపాడ్‌లో గత ఏడాది సెప్టెంబర్‌లో ఎస్‌బీఐ ఏటీఎంను ధ్వంసం చేసిన దుండగులు రూ.12 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఈ కేసు విచారణపై ఇప్పటివరకు పురోగతి లేదు. ఆ ఏటీఎం దోపిడీ కోసం దుండగులు జిల్లాలోని ఇందల్వాయి నుంచి కారును చోరీ చేసుకొచ్చారు. కాగా ఇందల్వాయి వచ్చేందుకు దుండగులు వినియోగించిన లారీని, లారీ డ్రైవర్‌ను మాత్రం పోలీసులు పట్టుకున్నారు.

■ మెండోరా మండలం బుస్సాపూర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో 2022లో భారీ చోరీ జరిగింది. రుణాల కోసం రైతులు తాకట్టు పెట్టిన 9 కిలోల బంగారాన్ని దుండగులు దోచుకున్నారు. పైగా దుండగులు గ్యాస్ కట్టర్లతో బ్యాంక్‌లో లాకర్లను ధ్వంసం చేసే ప్రయత్నం చేయగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి, రూ.8 లక్షల నగదు దగ్ధమైంది. ఈ బ్యాంకు చోరీ అప్పట్లో పెద్ద సంచలనమైంది. ఏటీఎంల చోరీ మాదిరిగానే సీసీ కెమెరాలపై నల్లటి రంగును స్ప్రే చేసిన అనంతరం గ్యాస్ కట్టర్‌తో కటింగ్ చేసి చోరీకి పాల్పడ్డారు. ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడైన ఏ1ను మినహా మిగతా ఆరుగురు నిందితులను పట్టుకున్నారు. దుండగుల ముఠా ఉత్తరప్రదేశ్‌కు చెందినదిగా గుర్తించారు. కాగా చోరీ అయిన సొత్తు పూర్తిగా రికవరీ కాలేదు. రుణాల కోసం పలువురు తాకట్టు పెట్టిన బంగారాన్ని ఇన్సూరెన్స్ ద్వారా బ్యాంక్ వాళ్లు సెటిల్ చేశారు.



ధ్వంసం చేసిన ఏటీఎం (ఫైల్)

సురేశ్‌రెడ్డికి అరుదైన గౌరవం

- బీఆర్‌ఎస్ పార్లమెంటరీ నేతగా, రాజ్యసభ ఫ్లోర్‌లీడర్‌గా ఎంపిక
- వరించిన రెండు పార్లమెంటరీ పదవులు
- ఆయనకు పదవి దక్కడంతో చౌట్‌పల్లికి మరోసారి ప్రాధాన్యం



మోర్తాడ్(బాల్కొండ): రాజ్యసభ సభ్యుడు(ఎంపీ) కేఆర్ సురేశ్‌రెడ్డికి బీఆర్‌ఎస్ పార్టీ పార్లమెంటరీ నేతగా, రాజ్యసభ ఫ్లోర్ లీడర్‌గా జోడు పదవులు దక్కడంతో కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లికి మరోసారి రాజకీయంగా ప్రాధాన్యత లభించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బీఆర్‌ఎస్ పార్లమెంటరీ నేతగా ఉన్న కేశవరావు ఎంపీ పదవీకాలం పూర్తవడం, ఆయన ఆ పార్టీకి రాజీనామా చేయడంతో పార్లమెంట్‌లో రెండు పదవులు ఖాళీ అయ్యాయి. దీంతో సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న రాజ్యసభ ఎంపీ సురేశ్‌రెడ్డిని రెండు పదవులు వరించాయి. పదవులకు సురేశ్‌రెడ్డిని ఎంపిక చేస్తూ ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉత్తర్వులను అందించారు.

సురేశ్‌రెడ్డి గతంలో బాల్కొండ ఎమ్మెల్యేగా నాలుగు పర్యా యాలు పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేసిన సురేశ్‌రెడ్డి తొలుత అసెంబ్లీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా కొనసాగారు. కాంగ్రెస్‌లో సుదీర్ఘకాలం ఉన్న ఆయన 2018 ముందస్తు అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయన పనితనాన్ని మెచ్చిన పార్టీ అధినేత రాజ్యసభ ఎంపీని చేశారు. సురేశ్‌రెడి పలు పార్లమెంట్ స్టాండింగ్ కమిటీలలో సభ్యుడిగా కొనసాగుతున్నారు. ప్రధాని మోదీ చైర్మన్‌గా ఉన్న పార్లమెంట్ స్టాండింగ్ కమిటీలోనూ సురేశ్‌రెడి సభ్యుడిగా కొనసాగడం విశేషం. ఆయనకు పార్లమెంటరీ కమిటీ జోడు పదవులు లభించడంతో అనుచరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఎన్ని గొర్రెలిచ్చారు..?

- ఆరేళ్ల వివరాలు కోరిన విజిలెన్స్ అధికారులు
- లెక్కలు తీసిన పశుసంవర్ధక శాఖ
- రెండు విడతల్లో 11,651 యూనిట్లు అందజేసినట్లు నివేదిక



డొంకేశ్వర్(ఆర్మూర్): రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సబ్సిడీ గొర్రెల స్కాం నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు జిల్లాల వారీగా వివరాలను సేకరిస్తున్నారు. గత ఆరేళ్లలో ఎన్ని గొర్రెలు ఇచ్చారో తెలపాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులను లెక్కలు కోరారు. దీంతో పశుసంవర్ధక శాఖ అధికారుల్లో గుబులు పట్టుకుంది. 2017–18 సంవత్సరం నుంచి 2023 వరకు జిల్లాలో పంపిణీ చేసిన గొర్రెలు యూనిట్లు ఎన్ని? వాటిని ఎక్కడి నుంచి తెచ్చారు? అయిన ఖర్చెంత? అనే వివరాలను సేకరించారు. లబ్ధిదారుల వారీగా లెక్కలు తీసిన జిల్లా అధికారులు రెండు విడతల్లో మొత్తం 11,651 యూనిట్లను అందజేసినట్లు నివేదికలో పేర్కొన్నారు. నివేదికను విజిలెన్స్ అధికారులతో పాటు రాష్ట్ర శాఖకు పంపనున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గొల్ల, కుర్మ, యాదవులకు సబ్సిడీపై గొర్రెలను అందజేయడానికి పథకాన్ని 2017–18లో ప్రారంభించింది. ఇందులో మొదటి విడతలో 10,722 యూనిట్లు అందజేయగా, రూ. 139.35 కోట్లు ప్రభుత్వానికి ఖర్చయ్యింది. అదే విధంగా రెండో విడతలో 929 యూనిట్లు పంపిణీ చేయగా రూ. 14.67 కోట్లు ఖర్చు జరిగింది. అధికారులు ఈ గొర్రెలను ఏపీ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసి జిల్లాకు తెచ్చారు. అయితే, లబ్ధిదారులకు పంపిణీ చేసే క్రమంలో అవినీతి జరిగిందా? అనే కోణంలో విజిలెన్స్ అధికారులు విచారణ చేపడుతున్నారు. లబ్ధిదారులకు జీవాలు ఇవ్వకుండానే నగదు చేతులు మారిందా అనే విషయంలో ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలోనే జిల్లాలో గొర్రెలు పొందిన ప్రతి లబ్ధిదారుడి ఊరు, పేరు, బ్యాంకు ఖాతా వివరాలు, జీవాల రవాణా, తదుపరి వివరాలను సేకరిస్తున్నారు.

వివరాలు సేకరించాం

జిల్లాలో రెండు దశల్లో జరిగిన సబ్సిడీ గొర్రెల పంపిణీ విషయంలో విజిలెన్స్ అధికారులు అడిగిన వివరాలను సేకరించాం. వారికి ఒకటి రెండు రోజుల్లో అందజేస్తాం. ఇదే నివేదికను రాష్ట్ర శాఖకు కూడా పంపుతున్నాం.

– జగన్నాథచారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

పదోన్నతులపై ప్రతిష్టంభన!

- కోర్టులో మళ్లీ ఇరుపక్షాల వాదనలు
- ఈనెల 20 వరకు వేచిచూడాల్సిందేనా?
- తుది జాబితాలో మళ్లీ మార్పులు

జిల్లా విద్యాశాఖలో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఎట్టకేలకు కొన్నేళ్ల తర్వాత పదోన్నతులు పొందుతామన్న టీచర్లకు కోర్టు కేసుల వ్యవహారం అడుగడుగునా అడ్డంకిగా మారుతోంది. గతేడాది నుంచి ప్రక్రియ పూర్తి కావడం లేదు.

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో 1,172 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 4,896 మంది టీచర్లు పనిచేస్తున్నారు. ఇందులో అర్హులైన వారికి బదిలీలు, పదోన్నతులు కోసం గతేడాది సెప్టెంబర్‌లో అప్పటి ప్రభుత్వం ప్రక్రియను ప్రారంభించింది. ఇందులో టెట్ అర్హత ఉన్న ఎస్జీటీలకే ప్రమోషన్ కల్పించాలని కొందరు టీచర్లు కోర్టును ఆశ్రయించారు. దీంతో నాన్‌టెట్ వారు సైతం మాకు కూడా పదోన్నతి ఇవ్వాలని కోర్టు మెట్లెక్కారు. ఎన్‌సీఈఆర్‌టీ నిబంధనల ప్రకారం 2010 కంటే ముందు వారికి టెట్ అవసరం లేదని పేర్కొంది. కానీ కొందరు టెట్ లేకుండానే అందరికీ పదోన్నతి కల్పించాలని కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఇరువురి వాదనలు విని 2023 అక్టోబర్‌లో కేసును వాయిదా వేసింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో విచారణ చేపట్టింది. టెట్ అవసరం లేదని అందరికీ పదోన్నతి ఇవ్వాలని మరొక్క బెంచ్, 2010 కంటే ముందు ఎస్జీటీలుగా పనిచేసిన వారికి టెట్ అవసరం లేదని.. మిగతా వారందరికీ టెట్ తప్పనిసరి అని మరో బెంచ్ తీర్పునిచ్చింది. దీంతో ప్రభుత్వం 2010 ముందున్న ఎస్జీటీలకు పదోన్నతి కల్పిస్తూ ప్రక్రియ మొదలు పెట్టింది. ఇందులో భాగంగానే ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. ఈనెల 8 నుంచి ఇందుకు సంబంధించిన ప్రక్రియను మొదలుపెట్టారు. ధ్రువపత్రాల పరిశీలన, వెబ్ ఆప్షన్లు సీనియారిటీ, అర్హుల జాబితాను కూడా రూపొందించారు. ఇదిలా ఉండగా సోమవారం పదోన్నతి పొందే వారికి ఆర్డర్లు ఇవ్వాల్సి ఉంది. దీంతో కోర్టుకు వెళ్లిన కొందరు పదోన్నతుల ప్రక్రియ నిలిపివేయాలని విన్నవించారు. సోమవారం కోర్టు ఇరువురి వాదనలు విని రెండు తీర్పులను అనుసరించి మరో బెంచ్‌కు విచారణను బదిలీ చేసింది. ఈనెల 20న ఈ విచారణ కొనసాగనుంది. అప్పటివరకు పదోన్నతులకు సంబంధించిన ఆర్డర్లు ఇవ్వాలా వద్ద అన్నదానిపై సందిగ్ధత నెలకొంది. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు పదోన్నతులకు సంబంధించిన ఆర్డర్లు ఇవ్వాలని ఆదేశాలు జారీచేస్తే జిల్లా శాఖ అధికారులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. కానీ ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో వేచిచూస్తున్నారు. పదోన్నతుల ప్రక్రియ మలుపులు తిరుగుతుడడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో భాషా పండితులు ఇతరులకు సంబంధించి 265 స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి 205 ఎస్జిటిలకు సంబంధించి 120 మందికి పదోన్నతులు కల్పించాల్సి ఉంది. వీరు ప్రస్తుతం ఆర్డర్ల కోసం వేసి చూస్తున్నారు.

తుది జాబితాలో మార్పులు

పదోన్నతుల ప్రక్రియలో భాగంగా తుది జాబితాలో విద్యాశాఖ సోమవారం పలు మార్పులు చేసింది. వీరిలో కొందరు అనర్హులు ఉండడంతో ఫిర్యాదులు వచ్చాయి. దీంతో పరిశీలన చేసిన విద్యాశాఖ మళ్లీ జాబితాలో పొరపాట్లు లేకుండా రూపొందించింది. అనంతరం జాబితాను రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు పంపించారు. అక్కడ నుంచి ఆమోదం లభిస్తే పదోన్నతుల తుది జాబితా ప్రకారం ఆర్డర్లు ఇవ్వనున్నారు.



జిల్లా విద్యాశాఖలో పదోన్నతుల ప్రక్రియకు విచ్చేసిన అర్హులైన టీచర్లు (ఫైల్)

ఆదేశాలు రాలేదు



పదోన్నతి పొందిన టీచర్లకు సంబంధించి ఆర్డర్లు ఇవ్వాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాలేదు. పైఅధికారులు ఆదేశాల ప్రకారమే ప్రక్రియను కొనసాగిస్తాం. అప్పటివరకు వేచి చూస్తాం.

– దుర్గాప్రసాద్, డీఈవో

అర్హులకు న్యాయం చేయాలి



పదోన్నతుల ప్రక్రియలో అర్హులకు న్యాయం చేయాలి. పదోతున్నలు, బదిలీల్లో కాలయాపన చేయడం సరికాదు. ఇప్పటికే ఎన్నో ఏళ్లు గడిచిపోతోంది. బదిలీలు, పదోన్నతులు లేక టీచర్లు ఇబ్బందులు పడుతున్నారు.

– వెనిగళ్ల సురేశ్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

ప్రసాద్‌కు డాక్టరేట్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ తెలుగు విభాగంలో పరిశోధక విద్యార్థి జి ప్రసాద్ డాక్టరేట్ పొందారు. సీనియర్ ఆచార్యులు అయాచితం వెంకటేశ్వరశర్మ పర్యవేక్షణలో 'నిజామాబాద్ జిల్లా పరమార్థిక్ సాహిత్యం-సమగ్ర పరిశీలన' అనే అంశంపై పరిశోధన చేపట్టారు. తెయూలో మంగళవారం మౌఖిక పరీక్ష నిర్వహించి ప్రసాద్‌కు డాక్టరేట్ అందజేశారు. చెన్నై యూనివర్సిటీ ఆచార్యులు శంకర్ రావు, తెలుగు విభాగ అధిపతి ఆచార్య కె లావణ్య, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామ్ డాక్టర్ అరుణ, ఆచార్య పి కనకయ్య, డాక్టర్ లక్ష్మణ్ చక్రవర్తి, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సీనియర్ జర్నలిస్టు మృతి

ఆర్మూర్: ఆర్మూర్ పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు గోస్కొండ అశోక్ (56) గుండెపోటు రాగా జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. సుమారు 36 ఏళ్ల పాటు ఆయన పత్రికా రంగంలో పనిచేశారు. జిల్లా కేంద్రంలో వెలువడే సాయంకాలం దినపత్రిక, ఓ ప్రధాన పత్రికలో పనిచేశారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆర్మూర్ పట్టణంలో 250 వారాల పాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. స్వగ్రామం కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ సమీపంలోని గొడవెల్లి కాగా 33 సంవత్సరాల క్రితం ఆర్మూర్ పట్టణంలో స్థిరపడ్డారు. భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అంత్యక్రియల్లో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, నాయకులు వినయ్‌రెడ్డి, గొర్త రాజేందర్, పట్టణ ప్రముఖులు డాక్టర్లు మధుశేఖర్, అశోక్, రమేశ్, వెంకట్ గౌడ్, ప్రకాష్, వివిధ పార్టీల నాయకులు ఖాందేశ్ శ్రీనివాస్, పుప్పాల శివరాజ్, దేగాం యాదగౌడ్, కొక్కెర భూమన్న, పద్మశాలి సంఘం ప్రతినిధులు రూపాళి మురళి, ఈరవత్రి రాజశేఖర్, విద్యాసాగర్, ధర్మపురి, అంబల్ల శ్రీనివాస్, కోటపాటి నర్సింహనాయుడు, జర్నలిస్టులు పాల్గొన్నారు.



అశోక్ (ఫైల్)

బంగారం దుకాణాల బంద్

కామారెడ్డి అర్బన్: బంగారం దొంగతనాల విషయంలో పోలీసుల తీరును నిరసిస్తూ మంగళవారం కామారెడ్డి పట్టణంలోని బంగారం, నగల వ్యాపారులు బంద్ పాటించారు. బంగారం చోరీ కేసుల్లో దొంగల వద్దనుంచి కాకుండా బంగారం దుకాణ యాజమానుల నుంచి సొత్తు స్వాధీనం చేస్తూ పోలీసులు వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పోలీసుల తీరును నిరసిస్తూ హైదరాబాద్‌లో నిరాహార దీక్ష చేస్తున్న కొండోజు నర్సింహాచారికి మద్దతుగా మంగళవారం బంద్ పాటించినట్లు సువర్ణ, రజిత, సంఘం ప్రతినిధులు ఎం.శ్రీనివాస్, వైశ్రీనివాస్, జి.శ్రీనివాస్ తెలిపారు.

మూగ వేదన..

- వైద్యం కోసం అల్లాడుతున్న జీవాలు
- బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల్లో ఇన్‌చార్జి వైద్యుడే దిక్కు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



కిసాన్‌నగర్‌లో ఉన్న పశు వైద్య శాల

బాల్కొండ: పాడి పశువులు, జీవాల ఆరోగ్యాన్ని కాపాడేందుకు నిర్మించిన పశువైద్యశాలల్లో సరైన చికిత్స అందడం లేదు. పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో పశువైద్యశాలలు మూసి ఉంటున్నాయి. దీంతో తమ మూగ జీవాలకు వైద్యం అందక అవి పడుతున్న వేదనను చూసి రైతన్నలు కంటతడి పెడుతున్నారు. తమ కుటుంబంలో మమేకమైన జీవాలకు వైద్యం అందించండి సారూ.. అంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో పశువైద్యుడు గత రెండున్నరేళ్లుగా లేరు. దీంతో ఇన్‌చార్జి పశువైద్యుడితోనే పశువులకు వైద్యం అందుతోంది. మోర్తాడ్ మండల పశువైద్యాధికారినే ఈ మూడు మండలాలతో పాటు మరో ఐదు మండలాలకు ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. అంటే 8 మండలాలకు ఒక్కరే పశువైద్యాధికారే విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వానాకాల సీజన్ ప్రారంభమైంది. ప్రధానంగా గొర్రెలు, పశువుల్లో వింత జబ్బులు వ్యాప్తి చెందుతాయి. వీటికి సకాలంలో వైద్యం అందించేందుకు వైద్యులు లేకపోవడం బాధకరం. బాల్కొండ మండలంలో బాల్కొండ, కిసాన్‌నగర్, ముప్కాల్ మండలంలో రెంజర్ల, మెండోరా మండల కేంద్రంలో పశు వైద్యశాలలు ఉన్నాయి. ఎక్కడా వైద్యులు లేరు. దీంతో పశువులకు వైద్యం గాలిలో దీపంలా మారింది. ప్రభుత్వాలు మారుతున్నా పశువులకు అందే వైద్య పరిస్థితి మాత్రం మారడం లేదు. 2023లో 317 జీవో ప్రకారం బాల్కొండ, కిసాన్‌నగర్‌లకు పశువైద్యులు వచ్చారు. దూరభారం ఎక్కువ కావడంతో తిరిగి వారి స్వంత ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఫలితంగా మళ్లీ ఖాళీలు ఏర్పడ్డాయి.

పశువులకు కొరత లేదు

ఉమ్మడి బాల్కొండ(బాల్కొండ, ముప్కాల్, మెండోరా) మండలంలో పశువుల కొరత లేదు. 2017 పశుగణన ప్రకారం.. ఎద్దులు 729, గేదెలు4152, గొర్రెలు 13354, మేకలు 4447, ముప్కాల్ మండలంలో ఎద్దులు 461, గేదెలు 2265, గొర్రెలు 8798, మేకలు 1473, మెండోరా మండలంలో ఎద్దులు 622, గేదెలు 2714, గొర్రెలు 12984, మేకలు 2448 ఉన్నాయి. ప్రస్తుతం వీటికి అటెండర్ల ద్వారా మాత్రమే వైద్యం అందుతోంది. సోమవారం రాత్రి బాల్కొండ మండలం బస్సాపూర్ శివారులో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతంలో కుక్కల దాడిలో జింక గాయపడితే పశు వైద్యాధికారి రావడానికి నాలుగు గంటల సమయం పట్టింది. అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొత్త ప్రభుత్వంలోనైన పశువైద్యుల నియామకం జరుగుతుందని రైతులు ఆశిస్తున్నారు. పాలకులు స్పందించి వెంటనే పశువైద్యులను నియమించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

పశువైద్యుల కొరతపై ఉన్నతాధికారులకు ఇది వరకే నివేదించాం. బదిలీల్లో కొత్తగా వైద్యులు వచ్చే అవకాశం ఉంది. అప్పటి వరకు ఇలానే కొనసాగనుంది. ఎక్కడైనా పశువులకు సమస్యలు ఉంటే వెంటనే సమచారం అందించాలి. – డాక్టర్ గౌతంరాజు, ఇన్‌చార్జి పశువైద్యాధికారి, బాల్కొండ

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



గుమ్మిర్యాల్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్న తహసీల్దార్

మోర్తాడ్: ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్ గోదావరి నది నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. గ్రామ కమిటీ టెండర్ నిర్వహించడంతో ఏడాదికి రూ.3లక్షలు చెల్లించడానికి ముందుకు వచ్చిన ఒకరు కోమటి కొండాపూర్ వ్యాపారులతో కలిసి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల రాత్రిపూట ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారంతో ఏర్గట్ల తహసీల్దార్ యూసుఫ్ సిబ్బంది సహకారంతో నిఘా పెంచారు. ఇసుకలోడ్‌తో ఉన్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేశారు. గుమ్మిర్యాల్ గోదావరి నది నుంచి రాత్రిపూట వాహనాల్లో మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం మండలాలకు జోరుగా ఇసుకను రవాణా చేస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు నిఘా పెంచి ఇసుక అక్రమ రవాణాను నిరోధించాలని పలువురు కోరుతున్నారు.

మొక్కలను సిద్ధం చేయాలి



కామారెడ్డి రూరల్: రానున్న హరితహారం కార్యక్రమానికి మొక్కలను సిద్ధం చేయాలని ఎంపీవో మలహరి సూచించారు. మంగళవారం ఉగ్రవాయిలో ఆయన నర్సరీని పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా నీరు పట్టాలన్నారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి మిషన్ భగీరథ పథకం పరిశీలించారు. కార్యదర్శి శ్రీనివాసులు ఉన్నారు.

గతంలో కూతురిపై అత్యాచారం.. ఇప్పుడు తండ్రిపై దాడి

- కామారెడ్డి జిల్లాలో కలకలం రేపిన ఘటన
- నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం రాఘవపల్లి గ్రామ శివారులో వృద్ధునిపై జరిగిన కత్తిదాడి ఘటనలో.. నిందితుల్లో ఇద్దరు గతంలో మానసిక వికలాంగులారైన బాధితుని కూతురిపై జరిగిన అత్యాచారం కేసులో నిందితులే కావడం స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం...రాఘవపల్లికి చెందిన నార్ల నాగయ్య సోమవారం రాత్రి కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామ శివారులోకి వెళ్లాడు. అదే సమయంలో ముగ్గురు వ్యక్తులు కత్తితో అతని గొంతు కోశారు. తీవ్రంగా గాయపడిన నాగయ్యను స్థానికులు చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామానికి చెందిన జూకంటి రమేశ్, జూకంటి సాయిలు, పుట్ల శ్యాంకుమార్ కత్తితో తన గొంతు కోశారని నాగయ్య పేర్కొనడంతో మంగళవారం పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. బాధితుడు నాగయ్యకు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పెద్ద కూతురు మానసిక వికలాంగురాలు కాగా సుమారు రెండేళ్ల క్రితం ఆమెపై నలుగురు లైంగిక దాడికి పాల్పడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో జైలుకు వెళ్లొచ్చిన నిందితులలో ఇద్దరు మరో వ్యక్తితో కలిసి నాగయ్యపై హత్యాయత్నానికి పాల్పడ్డట్లు బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణను వేగవంతం చేశారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. క్లూస్ టీం ద్వారా ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించి ఓ కత్తిని స్వాధీనం చేసుకున్నారు. నాగయ్యపై జరిగిన కత్తిదాడికి సంబంధించి అన్నికోణాలలో విచారణ జరుపుతున్నామని నాగిరెడ్డిపేట ఎస్సై రాజు తెలిపారు. విచారణ పూర్తయితేనే స్పష్టత వస్తుందన్నారు.



వృద్ధునిపై హత్యాయత్నం ఘటనలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం సభ్యులు

ప్రైవేటు ఆస్పత్రుల నివేదిక సిద్ధం

- నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటికి నోటీసులు జారీ
- వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లినిక్‌ల నివేదికను జిల్లా వైద్యశాఖ అధికారులు సిద్ధం చేశారు. సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'కమీషన్లు.. పంపకాలు' అనే కథనానికి జిల్లా వైద్యశాఖ అధికారులు స్పందించారు. గత 15 రోజులుగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆస్పత్రులను తనిఖీ చేసి నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీల లెక్క లేదు

జిల్లాలో ఉన్న ఆర్‌ఎంపీ, పీఎంపీల విషయంలో వైద్యశాఖ వద్ద ఎలాంటి లెక్కలు లేవు. నిబంధనల ప్రకారం పల్లె, పట్టణాల్లో ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఎలాంటి వైద్య సేవలు అందించరాదు. వీరికి శాఖ నుంచి ఎలాంటి అనుమతి ఉండదని అధికారులు చెబుతున్నారు.

వివరణ తర్వాతే చర్యలు

జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులు ఎన్ని ఉన్నాయో ప్రత్యేకంగా గుర్తించడం జరిగింది. నిబంధనల ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటికి ముందుగా నోటీసులు ఇచ్చి వివరణ తీసుకుంటాం. ఆర్‌ఎంపీ, పీఎంపీలపై నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆధారంగానే చర్యలు తీసుకుంటాం. – తుకారం రాథోడ్, డీఎంహెచ్‌వో

అధికారులు తనిఖీ చేసిన వివరాలు	డెంటల్ క్లినిక్‌లు	ల్యాబ్ స్కాన్,ఎక్సరే	ప్రైవేట్ ఆస్పత్రులు	ఫిజియో థెరపీలు	మొత్తం
తనిఖీలు చేసినవి	75	84	345	25	529
రిజిస్ట్రేషన్ ఉన్నవి	41	60	282	11	394
రిజిస్ట్రేషన్ లేనివి	24	22	64	12	112
అన్ని పత్రాలు సమర్పించినవి	26	60	174	19	279
రెన్యూవల్ తేదీ ముగిసినవి	04	06	05	02	17
బయోమెడికల్ వేస్టేజ్ సర్టిఫికెట్ ఇచ్చినవి	31	22	163	01	217
బయో మెడికల్ వేస్టేజ్ సర్టిఫికెట్ గడువు ముగిసినవి	33	22	36	09	100
ధరల పట్టిక ఉన్నవి	05	29	53	03	90
ఫైర్ సేఫ్టీ ఉన్నవి	06	20	101	–	127

పీఎం కిసాన్ పథకంపై అవగాహన

భీంగల్: పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు రూ.20 వేల కోట్ల నిధులు విడుదలైనట్లు ఫ్యాక్ట్ కంపెనీ జోనల్ మేనేజర్ రవీందర్ రాథోడ్ పేర్కొన్నారు. భీంగల్ వెంకటరమణ ఫర్టిలైజర్‌లో పీఎం కిసాన్ పథకంపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి నుంచి రైతులకు కిసాన్ పథకం ద్వారా రూ.20 వేల కోట్లు నిధులు విడుదలైనట్లు పేర్కొన్నారు. దేశంలోని రైతులను పీఎం కిసాన్ పథకం ద్వారా బలోపేతం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. దేశంలోని రైతు కుటుంబాలకు సానుకూల ఆదాయ మద్దతు అవసరమని, వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించేందుకు ఈ పథకం ఎంతో దోహదం చేస్తుందన్నారు. ఈ పథకం ద్వారా రైతు కుటుంబాలకు ఏడాదికి రూ. 6 వేలు అందించడం జరుగుతుందని, వీటిని మూడు విడతలుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకాన్ని మరింత బలోపేతం చేసేందుకు డిజిటల్ వ్యవస్థను తీసుకు రావడం జరిగిందని, ఇందులో మధ్యవర్థుల ప్రమేయం లేకుండా రైతులకు నేరుగా ప్రయోజనం చేకూర్చడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అవగాహన కార్యక్రమంలో పల్లికొండ భూపతి, పల్లికొండ శివకుమార్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవీందర్ రాథోడ్

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి

- అధికారులను ఆదేశించిన జిల్లా వ్యవసాయాధికారి
- పీఏసీఎస్‌లలో ఎరువులు, విత్తన కొనుగోలు రిజిస్టర్ల పరిశీలన

నిజామాబాద్ రూరల్: రైతులకు విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి వాజీద్‌హుస్సేన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని పలు సొసైటీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాధవనగర్ సొసైటీ పరిధిలో ఎరువులు, విత్తనాల విక్రయ విధానాలను పరిశీలించి సూచనలు చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఎరువుల లారీ వచ్చిన వెంటనే బిల్లులను పీవోఎస్ యంత్రాల్లో నిక్షిప్తం చేయాలని అధికారులకు సూచించారు. అమ్మిన ప్రతి బస్తా తాలూకు రైతు వివరాలను రికార్డుల్లో పొదుపరచాలన్నారు. నాసిరకం విత్తనాలు అమ్మిన ప్రైవేటు విత్తన, ఎరువుల దుకాణాలను సీజ్‌చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. రైతన్నలను మోసం చేస్తే సహించేది లేదన్నారు. ప్రభుత్వం ద్వారా లైసెన్సులు పొందిన ఫర్టిలైజర్ దుకాణాల్లోనే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయడంతో పాటు రశీదు తీసుకుని భద్రపరుచుకోవాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి జాదవ్ హీరా, సొసైటీ చైర్మన్ నాగేశ్వర్ రావు , సీఈవో వంశీ కృష్ణ, ఏఈవో స్వాతిలత, రమాకాంత్ ఉన్నారు.



మాధవనగర్ సొసైటీలో రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఆదిలాబాద్ వాసి మృతి

జక్రాన్‌పల్లి: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లి శివారులో చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణపల్లి బ్రిడ్జి వద్ద ఎన్‌హెచ్ 44 రోడ్డుపై ఆదిలాబాద్ పట్టణానికి చెందిన బంకలవాడు బాలాజీ (50)ని మంగళవారం ఉదయం నాలుగున్నర గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. దీంతో అతను ఘటన స్థలిలోనే మృతి చెందాడు. మృతుడు రెండు రోజుల క్రితం నందిపేట మండలం కంఠం గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఆర్మూర్ నుంచి బ్రహ్మణపల్లి జాతీయ రహదారిపైకి రాగా గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు కిందపడి ఒకరు..

నవీపేట: మండలంలోని ఫకీరాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి రైలు కిందపడి ఎడపల్లి మండలంలోని ఠానాకలాన్‌కు చెందిన బర్లకాడి సాయిలు (47) మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ జాన్ మంగళవారం తెలిపారు. రెంజల్ మండలంలోని తాడ్‌బిలోలిలో ఇంటి పైకప్పు కప్పేందుకు ముగ్గురు కూలీలతో కలిసి వెళ్లాడని పేర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో రాత్రి ఫకీరాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే గేటు దాటుతుండగా నాగర్‌సోల్ నుంచి నర్సాపూర్ వెళ్తున్న రైలు ఢీకొన్నది. ఈ ఘటనలో సాయిలు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అకారణంగా వృద్ధురాలిపై దాడి

- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి



కామారెడ్డి క్రైం: మతిస్థిమితం సరిగా లేని ఓ వ్యక్తి అకారణంగా దాడి చేయడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా వృద్ధురాలు మృతి చెందిన ఘటన కామారెడ్డి మండలం తిమ్మక్‌పల్లి(కె)లో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రాగుల లక్ష్మి (65) సోమవారం సాయంత్రం ఇంటికి వస్తుండగా పక్క ఇంట్లో నివాసం ఉండే రాజశేఖర్ తన తండ్రితో గొడవ పడుతూ కొడుతున్నాడు. అక్కడ ఆగినందుకు ఆగ్రహించిన రాజశేఖర్ వృద్ధురాలైన లక్ష్మిపై దాడి చేశాడు. కాళ్లు, తలపై రాళ్లతో కొట్టడంతో ఆమె అపస్మారక స్థితికి చేరింది. స్థానికులు వెంటనే కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. నిందితుడు రాజశేఖర్ కొంతకాలంగా సైకో మాదిరిగా వ్యవహరిస్తూ చాలా మందిపై దాడులకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. హత్య కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వాహనాల వేలం

ఖలీల్‌వాడి: అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్సైజ్ నేరాలలో జప్తు చేసిన వాహనాలకు వేలం నిర్వహించినట్లు ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో దిలీప్ తెలిపారు. నగరంలోని బోర్గాంలోని ఎక్సైజ్ కార్యాలయంలో డిప్యూటీ ఎక్సైజ్ కమిషనర్ సోమయ్య ఆదేశాల మేరకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జప్తు చేసిన వాహనాలకు వేలం నిర్వహించారు. వేలంలో జప్తు చేసిన ద్విచక్ర వాహనాలకు జిల్లా రవాణా శాఖ అధికారులు రూ. 44,500 నిర్ణయించగా రూ. 90,742 జీఎస్టీతో వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు మల్లేశ్, సుస్మిత, సింధు తదితులు పాల్గొన్నారు.



వేలం నిర్వహిస్తున్న అధికారులు

పిచ్చికుక్క స్వైర విహారం

భిక్కనూరు: మండలంలోని మల్లుపల్లిలో పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. గ్రామానికి చెందిన వృద్ధుడు షేక్ మజార్ తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లేందుకు మంగళవారం వేకువ జామున మూడు గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయలు దేరాడు. గ్రామంలోని వీధిని దాటుతుండగా ఓ పిచ్చికుక్క అతనిపై దాడి చేసింది. ముక్కు, చేతులు, కాళ్లపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. గమనించిన గ్రామస్తులు బాధితుడిని వెంటనే కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



తీవ్రంగా గాయపడ్డ షేక్ మజార్

అత్తను చంపిన కోడలు అరెస్టు

బిచ్కుంద(జుక్కల్): క్షణికావేశంలో పంట డబ్బులు అడిగితే ఇవ్వని అత్తను హత్య చేసి పరారీలో ఉన్న కోడలు పోలీసుల ఎదుట లొంగిపోయింది. ఎస్సై మోహన్‌రెడ్డి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. బిచ్కుంద మండలం బండారెంజల్ గ్రామానికి చెందిన బాలవ్వను కోడలు అంజవ్వ ఈ నెల 14న తమ వరి పంటకు వచ్చిన డబ్బులు రూ. 48వేలు ఇవ్వాలని కోరింది. దీంతో తాను ఇవ్వనని కోడలితో గొడవ పెట్టుకుంది. దీంతో మాటా మాటా పెరిగి అత్తను గొంతు నులిమి హత్య చేసి పారిపోయింది. ఈ ఘటనలో అంజలిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న అంజవ్వ ఉదయం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయి నేరం అంగీకరించినట్లు ఎస్సై పేర్కొన్నారు. నిందితురాలిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని హైమద్‌పుర కాలనీలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడి చేశారు. దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 7 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. దాడిలో సీఐ అంజయ్య, సిబ్బంది ఉన్నారు.

బోధన్‌లో బైక్‌లు చోరీ

బోధన్ టౌన్: పట్టణ కేంద్రంలో రెండు బైక్‌లు చోరీకి గురైనట్లు సీఐ వీరయ్య తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని తట్టికోట్ కాలనీకి చెందిన గంగుల మారుతి ఈ నెల 12న, సరస్వతినగర్ కాలనీకి చెందిన మధుసూదనాచారి ఈ నెల 17న వారి ఇళ్ల ఎదుట బైక్‌లను నిలిపి ఉంచగా దుండగులు రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఈ విషయమై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

బియ్యం లారీ బోల్తా

నస్రుల్లాబాద్: మండలంలోని ప్రధాన రహదారిపై బియ్యం లోడ్‌తో వెళ్తున్న లారీ మంగళవారం బోల్తా పడింది. బాన్సువాడ మండలం ఇబ్రహీంపేట్‌లోని శ్రీ నిలయం రైస్ ఇండస్ట్రీస్ నుంచి ఎఫ్‌సీఐ బోధన్ గోడౌన్‌కు తీసుకెళ్తుండగా లారీ అదుపు తప్పి బోల్తాపడిందని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి చర్యలు చేపట్టారు. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి.

బావపై హత్యాయత్నం

- కత్తితో గొంతుపై దాడి
- చెల్లిని హింసిస్తున్నాడని బావమరిది ఘాతుకం

లింగంపేట: చెల్లిని హింసిస్తున్నాడని బావను బావమరిది కత్తితో గొంతుపై దాడి చేసిన ఘటన మండలంలోని మెంగారం గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బోనాల్ గ్రామానికి చెందిన నీల స్వామితో ఎక్కపల్లి గ్రామానికి చెందిన సునీతకు కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరి దాంపత్య జీవితంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. గత 8 నెలల క్రితం భార్యా భర్తల మధ్య గొడవ జరగడంతో సునీత తన ఇద్దరు పిల్లలతో కలిసి తల్లిగారింటికి వెళ్లిపోయింది. తనకు చెల్లె వరుస అయిన సునీతను బావ స్వామి కాపురానికి తీసుకెళ్లడం లేదని బావమరిది నవీన్ కోపం పెంచుకున్నాడు. తన సమీప బంధువైన సుధాకర్‌తో కలిసి బావను హత్య చేయాలని పథకం వేశాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి మెంగారం గ్రామంలోని కల్లు దుకాణంలో నవీన్, సుధాకర్ నీలస్వామి కలిసి కల్లు తాగడానికి వెళ్లారు. అనంతరం ముగ్గురు కోమట్‌పల్లిలో ఉంటున్న స్వామి వాళ్ల అత్తమ్మ ఇంటికి వెళ్దామని బయలుదేరారు. వీరు మెంగారం బస్టాండు వద్దకు రాగానే స్వామిపై నవీన్, సుధాకర్ కత్తితో దాడి చేసి గొంతు కోశారు. స్వామి అక్కడి నుంచి తప్పించుకొని మెంగారం గ్రామంలోకి వెళ్లి గ్రామస్తులకు దాడి విషయం చెప్పాడు. అప్పటికే నవీన్, సుధాకర్ అక్కడి నుంచి పారిపోయారు. స్థానికులు ఏఎస్సై ప్రకాశ్‌కు సమాచారం ఇచ్చారు. ఏఎస్సై వెంటనే గ్రామానికి చేరుకొని స్వామిని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. స్వామి తల్లి అల్లెవ్వ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన నవీన్, సుధాకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్వామి

హత్య చేసింది బావే..

- చోరీ చేసిన బైక్‌ను దక్కించుకోవాలని..
- కల్లులో గడ్డిమందు కలిపిన వైనం
- నిందితుడి అరెస్టు, రిమాండ్

భిక్కనూరు: చోరీ చేసిన బైక్ తనకే దక్కాలనే ఆశతోనే బావమరిదిని హత్య చేసిన బావను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాయికుమార్ పేర్కొన్నారు. ఎస్సై మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కోటాని రంజిత్ తనకు వరుసకు బావ అయిన మెదక్ జిల్లా రామాయంపేట మండలం దామరచెర్వుకు చెందిన జగ్రిపోతుల బాబాశేఖర్‌తో కలిసి రామాయంపేటలో ఓ బైక్‌ను చోరీ చేశారు. వీరు ఈ నెల 3న భిక్కనూరు మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద ఉన్న కల్లు దుకాణంలో కల్లు తాగారు. దొంగిలించిన బైక్ తనకే దక్కాలనే దురుద్దేశంతో శేఖర్ ముందుగానే తన వెంట తెచ్చుకున్న గడ్డి మందును రంజిత్‌ను మిర్చిలు తీసుకురమ్మని చెప్పి అతను తాగే కల్లు సీసాలో పోశాడు. కల్లు తాగిన రంజిత్ అపస్మారకస్థితిలోకి వెళ్లగానే శేఖర్ తన ఫోన్ ద్వారా రంజిత్ కుటుంబీకులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. వారు వెంటనే కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ నెల 14న చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ విషయమై సీఐ సంపత్ విచారణ చేపట్టగా రంజిత్ మృతికి శేఖర్ నిందితుడని గుర్తించి అతని వద్ద ఉన్న రెండు బైక్‌లు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.